ప్రజల మాట ప్రగతి బాట

చెన్నూర్ నియోజకవర్గం

# ఊర చెరువుకు కొత్త కళ..



ఊరు మందమర్రిలోని ఊర చెరువు మినీ ట్యాంకు పై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

- వేగవంతంగా మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు
- బతుకమ్మ, తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు
- త్వరలోనే పూర్తిస్థాయి వినియోగంలోకి..
- పట్టణ ప్రజల హర్షం



ట్రాక్‌కు ఇరువైపులా లైటింగ్ సిస్టం

మందమర్రి, అక్టోబర్ 12: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఊరు మందమర్రి గ్రామంలోని ఊర చెరువుపై చేపట్టిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి, తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద మొదట చెరువు అభివృద్ధి పనులను చేపట్టినప్పటికీ నియోజక వర్గాల్లో మినీ ట్యాంక్‌బండ్‌లను నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఊర చెరువు మందమర్రి పట్టణానికి సమీపంలో ఉండడంతో చెరువును మినీ ట్యాంకు బండ్‌గా మార్చేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అందుకు ప్రభుత్వం రూ.1.66 కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. దీంతో చెరువు కట్టను వెడల్పు చేయడంతో పాటు 700 మీటర్ల పొడవునా రోడ్డు, వాకింగ్ ట్రాక్, రెండు బతుకమ్మ ఘాట్లను నిర్మించారు. ఊరు మందమర్రి గ్రామస్తుల సౌకర్యార్థం చెరువు కింద నుంచి నూతనంగా గ్రామం వరకు తారురోడ్డును నిర్మించారు. నిధుల కొరతతో కొంతకాలం పాటు పనులు నిలిచి పోయాయి. ఇటీవల ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ప్రత్యేక చొరవ తీసుకుని డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) కింద ట్యాంక్‌బండ్ సుందరీకరణకు కోటి రూపాయల నిధులను మంజూరు చేయించారు. మళ్లీ ప్రారంభమైన పనులు శరవేగంగా సాగుతున్నాయి. వాకింట్ ట్రాక్‌కు ఇరుపక్కల రేయిలింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సోలార్ ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు కనువిందు చేసేందుకు వివిధ రకాల పూల మొక్కలను ఇరువైపులా నాటారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ, తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరింత సుందరంగా తీర్చి దిద్దేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలు రకాల పూలు, పండ్ల మొక్కలను తీసుకు వచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా పూడిక మట్టిని తొలగించడంతో చెరువులోతు పెరిగి జల కళను సంతరించుకున్నది. దీంతో మత్స్య కారులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పశు పక్ష్యాదులకు తాగునీరు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సమీప ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండడంతో సమీప కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో ఊర చెరువు కొత్త కళను సంతరించుకోవడంతో పాటు పట్టణానికే ఆకర్షణీయంగా నిలుస్తున్నది. మినీట్యాంక్ బండ్ రక్షణకు మున్సిపాలిటీ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సూచన మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. రాత్రి సమయంలో ట్యాంక్‌బండ్ పైకి ఎవరూ రాకుండా ప్రత్యేక గేట్లను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు తెలిపారు. ట్యాంక్‌బండ్ సుందరంగా తయారు కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బతుకమ్మ విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దె

### మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పట్టణానికి కొత్త కళ..



ఊరు మందమర్రి ఊర చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడం సంతోషకరం. మినీ ట్యాంకు బండ్ నిర్మించాలని ఎంతో కాలంగా కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. మండలానికి ఒక మినీ ట్యాంక్‌బండ్ ఉండాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు ఊర చెరువునే అందుకు ఎంపిక చేయడంతో మా చిరకాల కోరిక నెరవేర్చడం సంతోషంగా ఉంది.

-మాసు వెంకటేశ్, మందమర్రి

### బతుకమ్మ ఘాట్లను నిర్మించడం సంతోషకరం..



ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడంతో పాటు బతుకమ్మ ఘాట్లను నిర్మించడం సంతోషకరం. ప్రతి ఏటా మహిళలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేందుకు ఇబ్బందులు పడేవారు. ఘాట్ల నిర్మాణంతో సమస్య పరిష్కారం అవుతుంది. వేడుకలు ఘనంగా జరుగుతాయి. బతుకమ్మ, తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేస్తే మరింత ఆకర్షణ పెరుగుతుంది.

-సీపెల్లి సాగర్, మందమర్రి

## పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు




మందమర్రి : కార్మెల్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు



కోటపల్లి : ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు

మందమర్రి, అక్టోబర్ 12: మందమర్రి పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. పాలచెట్టు ఏరియాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కార్మెల్ ఉన్నత పాఠశాలల్లో ఆడిపాడారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో..**

మందమర్రి రూరల్, అక్టోబర్ 12: మందమర్రి మండల పరిధిలోని మండల పరిధిలోని పొన్నారం, చిర్రకుంట, సారంగపల్లి, మామిడిగట్టు, ఆదిల్ పేట, వెంకటాపూర్, శంకర్‌పల్లి గ్రామాలతో పాటు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు.

**కోటపల్లిలో..**

కోటపల్లి, అక్టోబర్ 12 : కోటపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, రాంపూర్, బావనపల్లి తదితర పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

**చెన్నూర్ పట్టణంలో..**


చెన్నూర్ టౌన్, అక్టోబర్ 12 : చెన్నూర్ పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

**రామకృష్ణాపూర్‌లో..**

రామకృష్ణాపూర్, అక్టోబర్ 12: రామకృష్ణాపూర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్, తవక్కల్ పాఠశాల ఎస్.ఆర్.కే హైస్కూల్, తదితర పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు పెద్దపల్లి ఉప్పలయ్య, డైరెక్టర్లు కోల శ్రీనివాస్, డోకోరి సోమశేఖర్, రాజేందర్, దాసరి నరేశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.. తవక్కల్ పాఠశాలలో విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులున్నారు.



మందమర్రి రూరల్ : కేజీబీవీ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు



రామకృష్ణాపూర్ : తవక్కల్ పాఠశాలలో..

## నేటి నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు



పాఠశాలలో క్రీడా పోటీల కోసం సిద్ధం చేసిన మైదానం

చెన్నూర్, అక్టోబర్ 12: సాంఘిక సంక్షేమశాఖ గురుకుల (బాలికల) పాఠశాలల కాళేశ్వరం జోనల్ స్థాయి క్రీడా పోటీలు చెన్నూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల (బాలికల) పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ బీ రాజమణి గురువారం తెలిపారు. ఈ నెల 16వరకు పోటీలు కొనసాగుతాయని, కాళేశ్వరం జోన్ పరిధిలోని 15 సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలల విద్యార్థినులు పాల్గొంటారని ఆమె తెలిపారు. జోనల్ స్థాయిలో పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్, జావలిన్ త్రో లాంటి అథ్లెటిక్స్‌తో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్యారం లాంటి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థినులకు అన్ని రకాల వసతులను కల్పించినట్లు తెలిపారు.

## పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 12: చెన్నూర్ మండలంలోని సోమన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బృహత్ పల్లె ప్రకృతి వనంలో గుర్తు తెలియని దుండగులు మొక్కలను ధ్వంసం చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ధ్వంసమైన మొక్కలను, పల్లె ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. మంగళవారం దుండగులు 195 మొక్కలు నరికివేశారని, బుధవారం రాత్రి కూడా 1300 మొక్కలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మొక్కల ధ్వంసంపై చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మొక్కలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు.



ధ్వంసమైన మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో